

ఆధ్యాత్మిక సంబురం

వార్షిక బ్రహ్మోత్సవాలకు అలంపూర్ జోగులాంబ క్షేత్రం ముస్తాబైంది.

వివరాలు 8లో ▸



భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

కురుమూర్తి స్వామి ఆలయం వద్ద గిరి ప్రదక్షిణను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.8 /12.9

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రి చలిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆస్తి పన్ను వసూళ్లలో వేగం పెంచండి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ నగర పాలక సంస్థ, మున్సిపాలిటీలలో ఆస్తి పన్ను వసూలును వేగవంతం చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్లతో అర్బన్ డే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమించుకున్న వారు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని లే కుంటే నగర పాలక సంస్థ ద్వారా తొలగించాల ని ఆదేశించారు. జిల్లాకేంద్రంలో ఉండే ద్విచక్ర వాహనదారులందరూ హెల్మెట్ ధరించాలని, మహబూబ్‌నగర్‌కు వచ్చే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే నగరంలోకి అనుమతి నిరాకరించాలని సూచించారు. వార్డు ఆఫీసర్లు తమ వార్డులోని అనధికారిక కట్టడాలను గుర్తించి, టౌన్ ప్లానింగ్ విభాగానికి రిపోర్టు చేయాలని సూచించారు. మహబూబ్‌నగర్ నగర పాలక సంస్థ బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అర్బన్ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, పార్కుల సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పాల్గొన్నారు

1 నుంచి స్వయం ఉపాధి శిక్షణ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో వచ్చేనెల 1వ తేదీ నుంచి 16వ బ్యాచ్ శిక్షణ ప్రారంభిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన యువతకు మూడు నెలల పాటు ఫ్యాషన్ డిజైనింగ్, గార్మెంట్, బ్యూటీ షియన్, ఎంఎస్ ఆఫీస్, రిఫ్రిజిరేటన్, ఏసీ, మొబైల్ సరీ్వసింగ్, రిపేరుపై శిక్షణ ఇవ్వ నున్నట్లు పేర్కొన్నారు. 7వ తరగతి పాసైన వారి కి జర్దోసి, మగ్గం, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో శిక్ష ణ ఉంటుందని తెలిపారు. శిక్షణ అనంతరం పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి హైదరాబాద్ సెట్విన్ వారిచే సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు వివరించారు. ఆసక్తిగల వారు పాత డీఈఓ కార్యాలయంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో దరఖాస్తులు అందజేయాలని, దరఖాస్తు వెంట విద్యార్హత, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో జత చేయాలని కోరారు. మిగతా వివరాలకు సెంటర్ ఇన్‌చార్జి ఎస్.విజయ్‌కుమార్ (94415 65895) సంప్రదించాలని సూచించారు.

2న పాలమూరులో 'వాణి శతకం' ఆవిష్కరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ మహిళా సాహిత్య, సాంస్కృతి సంస్థ ఐదో వార్షికోత్సవం సందర్భంగా వచ్చేనెల 2వ తేదీన జిల్లా కేంద్రంలోని భారత్ స్కౌట్స్, గైడ్స్ భవన్‌లో ఉదయం 9 గంటలకు సంస్థ అధ్యక్షురాలు రావూరి వనజ రచించిన 'వాణి శతకం' ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు రావూరి వనజ, ప్రధాన కార్యదర్శి జి.శాంతారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య మసన చెన్నప్ప, మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, ప్రముఖ పద్యకవులు పొద్దుటూరి ఎల్లారెడ్డి, నలవోలు నరసింహారెడ్డి పాల్గొంటారని, పుస్తక సమీక్షులుగా ప్రముఖ రచయిత్రి చక్కాయపల్లి శ్రీదేవి హాజరవుతారని తెలిపారు.

కొత్త గ్రూపులు ఏర్పాటు చేయాలి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణ పరిధిలో 2,858 ఎస్‌హెచ్‌జీలు ఉండగా కొత్తగా మరో 2,485 గ్రూపులు ఏర్పాటు చేయాలని ఇన్‌చార్జ్ మెప్మా పీడీ డి.మహేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని మెప్మా భవనంలో ఆర్‌పీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజుల్లోగా ఒక్కో ఆర్‌పీ కనీసం 30 చొప్పున వీటిని గుర్తించాలన్నారు. ముఖ్యంగా ఇందిర మహిళాశక్తి పథకం కింద ఎస్‌హెచ్‌జీలు ముందుకు వచ్చి వివిధ క్యాంటీన్లు, డెయిరీ ఫామ్స్ తదితర యూనిట్లు ఏర్పాటు చేసుకుని లబ్ధి పొందాలని సూచించారు. అలాగే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణ బకాయిలు వంద శాతం వసూలు చేయాలన్నారు. అందరూ బాధ్యతగా పనిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం స్త్రీనిధి ఆర్‌ఎం వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది 65 ఎస్‌ఎల్‌ఎఫ్‌లకు రూ.64.56 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. ఇప్పటివరకు 87 శాతం రికవరీ అయిందని, మిగిలిన 13 శాతం సైతం వసూలు చేయాలన్నారు. ఎల్‌డీఎం కల్యాభాస్కర్, ఇన్‌చార్జి డీఎంసీ ఎం.లక్ష్మి, సీఓలు వరలక్ష్మి, నిర్మల, దేవమ్మ పాల్గొన్నారు.



జడ్చర్ల శివారులో బ్లాస్టింగ్‌తో పూర్తిగా ధ్వంసమైన కొండ

దర్జాగా తవ్వేస్తున్నారు!

జడ్చర్ల పరిసర ప్రాంతాల్లో నేలమట్టం అవుతున్న గుట్టలు

- రెచ్చిపోతున్న మైనింగ్ మాఫియా
- యథేచ్ఛగా బండరాళ్లు, మట్టి తరలింపు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, మైనింగ్‌శాఖ యంత్రాంగం

విలువైన ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. శతాబ్దాలుగా ఉన్న గుట్టలు, కొండలు అక్రమార్కుల చేతుల్లో పడి శల్యం అవుతున్నాయి. భవిష్యత్ తరాలకు ఇక్కడ గుట్టలు ఉన్నాయన్న విషయాన్ని నమ్మలేనంతగా ఆనవాళ్లను సైతం అదృశ్యం చేస్తున్నారు. భారీ సామర్థ్యం గల హిటాచీ, పొక్లెయిన్లు.. ఇతర యంత్ర సామగ్రి సాయంతో సహజ సిద్ధ కొండలను దర్జాగా తవ్వేస్తున్నారు. టిప్పర్లలో ఉదయం, రాత్రి అనే తేడా లేకుండా మట్టిని, బండరాళ్లను తరలిస్తున్నారు. మైనింగ్ మాఫియా రెచ్చిపోతుండడంతో ప్రభుత్వ, పట్టాభూముల్లో ఉన్న గుట్టలు నేలమట్టం అవుతున్నాయి. తవ్వకాలను అరికట్టాల్సిన రెవెన్యూ, మైనింగ్‌శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారు. స్థానికులు అధికారులకు పదేపదే ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

– జడ్చర్ల

జడ్చర్ల పట్టణ చుట్టుపక్కల ప్రాంతాల్లో గుట్టలు, కొండలు ఉన్నాయి. వీటిని తవ్వి, బ్లాస్టింగ్ చేసి బండరాళ్లను యథేచ్ఛగా ఇతర ప్రాంతాల తరలిస్తున్నారు. మట్టిని సైతం టిప్పర్ల ద్వారా రేయింబవళ్లు రవాణా చేస్తున్నారు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే.. తమ పట్టా భూముల్లో ఉన్నాయంటూ అక్రమార్కులు బుకాయిస్తున్నారు. కొందరేమో ప్రభుత్వ భూముల్లో ఉన్న గుట్టలు తమవే అంటూ దర్జాగా తవ్వకాలు చేస్తున్నారు. జడ్చర్ల హౌసింగ్ బోర్డు వెనుకాల సర్వే నంబర్ 297లోని ప్రభుత్వ భూమిలో గల ఓ భారీ గుట్టను ఆరు మాసాలుగా బ్లాస్టింగ్ చేస్తూ నేలమట్టం చేస్తున్నారు. ఇదే తరహాలో హౌసింగ్‌బోర్డును ఆనుకుని ఉన్న కోశ గుట్టను సైతం తవ్వేశారు. కొన్ని రోజుల్లో ఇక్కడ గుట్టలు ఉన్నాయన్న ఆనవాళ్లు కూడా కనిపించవు. ఇప్పటికే శంకరాయపల్లి శివారులో ఉన్న బొంగరాళ్ల గుట్ట కర్పూరంలా కరిగిపోయిన పరిస్థితి. ఇదే తండా శివారులో మరో గుట్టను సైతం తవ్వేస్తున్నారు. ఎర్రగుట్ట, బూరెడ్డిపల్లి శివారులోని గుట్టల ప్రాంతంలో తవ్వకాలు కొనసాగుతున్నాయి.



ప్రమాదకరంగా మారిన భగీరథ ట్యాంకు

ప్రమాదం అంచున భగీరథ ట్యాంకు..

మట్టి తవ్వకాలు చేస్తుండడంతో భారీ సామర్థ్యంతో నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంకుకు ప్రమాదం ఏర్పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. హౌసింగ్ బోర్డు సమీపంలోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన ట్యాంకు చుట్టూ అక్రమార్కులు మట్టిని తవ్వుతుండడంతో ట్యాంకు కూలిపోయే పరిస్థితులు ఉన్నాయి.

■ గుట్టలు, కొండలు, ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. కళ్ల ఎదుటే భారీ హిటాచీలు, టిప్పర్లతో గుట్టలను ధ్వంసం చేస్తున్నా కళ్లప్పగించి చూస్తున్నారే గానీ చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోతుందన్నారు.


దర్జాగా తవ్వుతున్నారు..



జడ్చర్ల, బూరెడ్డిపల్లి శివార్లలోని గుట్టలను యథేచ్ఛగా తవ్వుతున్నారు. బ్లాస్టింగ్‌లు పెట్టి బండలను పిండి చేస్తున్నారు. టిప్పర్లలో మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్ శాఖలు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.

– నర్సిములు, బూరెడ్డిపల్లి

గుట్టల ఉనికికి ప్రమాదం..



జడ్చర్ల చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉన్న గుట్టల ఉనికికి ప్రమాదం ఏర్పడింది. విచ్చలవిడిగా ధ్వంసం చేయడంతో పర్యావరణం దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. రియల్ వ్యాపారులు, మట్టి మాఫియా మూకుమ్మడిగా గుట్టలను నాశనం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– మహిపాల్‌రెడ్డి రెడ్డి, జడ్చర్ల

చర్యలు తీసుకోవాలి..



శంకరాయపల్లి, జడ్చర్ల చుట్టు పక్కల ప్రాంతాలలో రేయింబవళ్లు గుట్టలను తొలచి మట్టిని రవాణా చేస్తున్నారు. దీంతో గుట్టలు నామరూపాలు లేకుండా పోతున్నాయి. మైనింగ్ మాఫియాపై చర్యలు చేపట్టే విధంగా అధికారులు స్పందించాలి. క్షేత్రస్థాయిలో విచారించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

– గోపాల్‌నాయక్, శంకరాయపల్లి

ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు



గుట్టల తవ్వకాలకు పాల్పడే వారిపై నిబంధనల మేరకు చర్యలు చేపడుతాం. హౌసింగ్ బోర్డు వెనుకాల గల గుట్టల తొవ్వకాలకు సంబంధించి మైనింగ్ శాఖ అధికారులతో కలిసి విచారించి చర్యలు తీసుకుంటాం. మట్టి తవ్వకాలకు, తరలింపునకు సంబంధించి ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు.

– బ్రహ్మంగౌడ్, తహసీల్దార్, జడ్చర్ల



హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలో మరో గుట్ట పరిస్థితి..



హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలో కోశ గుట్ట

బాధ్యతగా డ్రైవింగ్ చేయండి



ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయేందిర, ఎస్పీ జానకి

- నిబంధనలు ఉల్లంఘించడంతోనే ప్రమాదాలు: కలెక్టర్
- జిల్లాకేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించిన పోలీస్‌శాఖ

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్లపై నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వల్లే ప్రమాదాలు చోటు చేసుకుంటాయని, ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీటు బెల్ట్ తప్పక ధరించాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్, రవాణాశాఖ ఆధ్వర్యంలో బుధవారం క్లాక్‌టవర్ నుంచి మెట్టుగడ్డ వరకు నిర్వహించిన ద్విచక్ర వాహన ర్యాలీని కలెక్టర్‌తో పాటు ఎస్పీ డి.జానకి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ క్లాక్ టవర్ నుంచి అశోక్ టాకీస్ చౌరస్తా, అంబేద్కర్ కూడలి, న్యూటౌన్, మెట్టుగడ్డ అక్కడి నుంచి వన్‌టౌన్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా క్లాక్ టవర్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. వాహనదారులు బాధ్యతగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రజలు, అధికార యంత్రాంగం కలిసి పని చేయాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేయడం ద్వారా ప్రమాదాలు తగ్గించవచ్చునని తెలిపారు. ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ ఇలాంటి బైక్ ర్యాలీలు యువతకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచడంతో పాటు రోడ్డు భద్రత ప్రాముఖ్యతను తెలియజేస్తోందన్నారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించడం, నిబంధనలు పాటించడం అనివార్యం అన్నారు. ప్రమాదాలను నివారించేందుకు, బాధ్యతయుతమైన రైడింగ్ అలవర్చుకోవాలన్నారు. సురక్షిత ప్రయాణం మన కుటుంబానికి, సమాజానికి మేలు కలిగిస్తోందన్నారు. అంతకుముందు రోడ్డు ప్రమాదాల కట్టడిపై ఏర్పాటు చేసిన బ్రోచర్స్, కరపత్రాలను ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఏఎస్పీ రాములు, డీటీసీ కిషన్, ఆర్టీవో రఘుకుమార్, డీఎస్పీ సుదర్శన్, సీఐలు భగవంతురెడ్డి, అప్పయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

లక్ష డప్పులతో ప్రభుత్వాన్ని కదిలిద్దాం

- ఎస్సీ వర్గీకరణ అంశాన్ని శాంతిభద్రతల సమస్యగా మార్చాలని చూస్తున్నారు..
- 'లక్ష డప్పులు – వేల గొంతులు' సన్నాహక సభలో మందకృష్ణమాదిగ



డప్పు కొడుతున్న మందకృష్ణ మాదిగ

జడ్చర్ల టౌన్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని శాంతిభద్రతల సమస్యగా తీసుకువచ్చి.. అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీలోని మాల ప్రజాప్రతినిధులు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన 'లక్ష డప్పులు– వేల గొంతులు' భారీ ఆయుధ ప్రదర్శన మహాసభకు సంబంధించి బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా సన్నాహక సమావేశాన్ని జడ్చర్లలోని చంద్రగార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ.. వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీలు అనుకూలంగా ఉన్నాయని.. సుప్రీంకోర్టు తీర్పు కూడా అనుకూలంగా వచ్చిందన్నారు. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వర్గీకరణ చేస్తామని ప్రకటించినా.. అమలు చేయకుండా ఉండటానికి కాంగ్రెస్ పార్టీలో బలంగా ఉన్న మాలలే కారణమన్నారు. నాగర్‌కర్నూల్ సభలో వర్గీకరణను అడ్డుకుంటామని మీసాలు మెలేశారని, సింహగర్జన సభలో తొడ కొట్టారని గుర్తుచేశారు. అవసరమైతే మందకృష్ణను చంపైనా వర్గీకరణను అడ్డుకుంటామని వారు ప్రకటిస్తున్నారంటే.. కేవలం మాదిగలను రెచ్చగొట్టి ఘర్షణలకు దారి తీసేందుకే యత్నిస్తున్నారని అన్నారు. వారి మాయలో పడొద్దన్నారు. తాను ఏ పార్టీకి అనుకూలం కాదని.. అలాగని ఏ పార్టీకి వ్యతిరేకం కాదన్నారు. 30 ఏళ్లుగా నల్లకండువా వేసుకుని ఉన్నానన్నారు. తనకు పదవులు ఇస్తానని చెప్పినా తీసుకోలేదని గుర్తుచేశారు. వర్గీకరణ ఫలితాలు మాదిగ బిడ్డలకు దక్కాలంటే తప్పనిసరిగా డప్పు సంకనేసుకుని రావాలని కోరారు. లక్ష డప్పులను మోగించి కాంగ్రెస్ ప్రభుత్వంలో కదలిక తీసుకువద్దామని పిలుపునిచ్చారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డప్పు కొడుతూ కాలినడన చంద్ర గార్డెన్‌కు చేరుకున్నారు. సదస్సులో ఎమ్మార్పీఎస్ నాయకులు జంగయ్యమాదిగ, రొట్టె శేఖర్, పోల శివన్న, దత్తు, శేఖర్, యాదయ్య, నాగరాజు, సువార్త, బాలయ్య, సురేష్, బాల్‌రాజు, శశికిరణ్, నడిమింటి శ్రీను పాల్గొన్నారు.

నేడు మహబూబ్‌నగర్ మార్కెట్ యార్డుకు సెలవు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): మహబూబ్‌నగర్ మార్కెట్ యార్డులో గురువారం వేరుశనగ పంట కొనుగోళ్లు జరగవని చైర్‌పర్సన్ బెక్కరి అనిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీన 27,035 బస్తాల వేరుశనగ మార్కెట్‌కు వచ్చిందని, ఆ బస్తాలను లిఫ్టింగ్ పూర్తికానందున గురువారం యార్డుకు వచ్చే వేరుశనగ పోయడానికి స్థలం లేదని, దాంతో మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు. 31వ తేదీన తిరిగి యథావిధిగా పంట క్రయవిక్రయాలు జరుగుతాయని, ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

అందని 'భరోసా'..

పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్న రైతులు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 13,23,813 మంది అర్హులు
- ఇప్పటివరకు భరోసా ఇచ్చింది 57,914 మందికే
- మండలానికి ఒక్క గ్రామం రైతులకే సొమ్ము జమ చేసిన ప్రభుత్వం
- మిగతా వారికి ఎప్పుడన్నదానిపై స్పష్టత కరువు

సాక్షి, నాగర్‌కర్నూల్: ప్రభుత్వం రైతుభరోసా కింద రైతులకు అందిస్తున్న పెట్టుబడి సాయం కొందరికే అందింది. మండలానికి ఒక్క గ్రామం చొప్పున ఎంపిక చేసి ఆ గ్రామంలోని రైతులకే ప్రభుత్వం భరోసా కింద ఆర్థికసాయాన్ని అందజేసింది. ఇంకా సాయం అందాల్సిన వారు పెద్దసంఖ్యలో ఉండటంతో తమ వంతు ఎప్పుడు వస్తుందా? అని ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ పథకం కింద అర్హులైన రైతులందరికీ ఎప్పటి నుంచి ప్రభుత్వ సాయం అందుతుందన్న దానిపై స్పష్టత కరువైంది.

5 శాతం లోపు రైతులకే..

రైతు భరోసా పథకం కింద ఈసారి ప్రభుత్వం ఒక్కో ఎకరాకు తొలి విడతలో రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందిస్తోంది. ఈ నెల 26న రైతుభరోసా పథకాన్ని ప్రారంభించినా, ఆ రోజున బ్యాంకులకు సెలవు కావడంతో 27న ఉదయం నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమైంది. అర్హులైన రైతులందరికీ ఒకేసారి కాకుండా, మండలానికి ఒక గ్రామం చొప్పున అధికారులు ఎంపిక చేసిన గ్రామాల్లోని రైతుల ఖాతాల్లో మాత్రమే ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని జమ చేసింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 13,23,813 మంది రైతులు ఈ పథకానికి అర్హులుగా తేలగా, ఇప్పటి వరకు ప్రభుత్వ సాయాన్ని అందించింది 57,914 మందికే. కేవలం 5శాతం లోపు రైతుల మాత్రమే సాయాన్ని అందుకోగా, ఇంకా పెద్ద సంఖ్యలో రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం సకాలంలో వ్యవసాయానికి ఆర్థికసాయాన్ని అందించాలని కోరుతున్నారు.



పొలంలో పనిచేస్తున్న రైతు

సాగు లెక్కలపై సా..గుతున్న కసరత్తు..

ఈసారి రైతుభరోసా కింద సాయం అందించేందుకు కేవలం వ్యవసాయ యోగ్యమైన భూములకు మాత్రమే పెట్టుబడి సాయాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పౌల్ట్రీ, రియల్ ఎస్టేట్ వెంచర్లు, లేఅవుట్లు, ఫిషరీస్, నాలా కన్వర్షన్, కమర్షియల్ తదితర భూములను గుర్తించి ఈ పథకం లబ్ధిదారుల జాబితా నుంచి తొలగిస్తోంది. అయితే అర్హులైన రైతులందరికీ సాయం అందించేందుకు లబ్ధిదారుల తొలగింపు ప్రక్రియ పూర్తికాక పోవడమే అడ్డంకిగా మారింది. వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించి ఫ్రీజ్ చేస్తేనే మిగతా వారికి ఇచ్చేందుకు మార్గం సుగమం కానుంది. ఒకే సర్వే నంబరులో ఉన్న వ్యవసాయ భూములు, వ్యవసాయ యోగ్యం కాని భూములను ఫ్రీజ్ చేసే విషయంలో పీటముడి నెలకొంది. ఈ కసరత్తు ఇంకా కొనసాగుతుండటంతో మరో వారం రోజుల తర్వాతే మిగతా రైతులకు ప్రభుత్వ సాయం అందించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.

జిల్లాల వారీగా రైతుభరోసా పథకం వివరాలు (రూ. కోట్లలో)

జిల్లా	అర్హులైన రైతులు	మొత్తం డబ్బులు	సాయం పొందిన రైతులు	జమ చేసిన డబ్బులు
మహబూబ్‌నగర్	2,50,239	276.09	14,526	17.23
నాగర్‌కర్నూల్	3,30,836	451.26	16,806	23.01
వనపర్తి	3,68,799	442.56	9,415	12.21
జోగులాంబ గద్వాల	1,81,919	278.80	7,819	12.45
నారాయణపేట	1,92,020	275.18	9,348	13.87

ఇప్పట్లో వస్తాయన్న నమ్మకం లేదు..



నాకు మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో రెండు ఎకరాల్లో మొక్కజొన్న, మరో ఎకరంలో వరి సాగుచేస్తున్నా. ఇప్పటికే నాట్లు వేసుకున్నా. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందలేదు. గత వానాకాలం సీజన్‌లో కూడా ఇవ్వలేదు. ఇప్పట్లో ఇస్తదన్న నమ్మకం కూడా కుదరడం లేదు. ప్రభుత్వం సకాలంలో రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించాలి.

– చిటమోని సుధాకర్, గట్టురాయిపాకుల, తెలకపల్లి మండలం

మండలానికో గ్రామమేనా..



మండలానికో గ్రామాన్ని ఎంపిక చేయడం ఎంతవరకు సమంజసం. మా కుటుంబానికి నాలుగెకరాల భూమి ఉంది. అందులో వరి పంట సాగు చేశాను. రైతు భరోసా వస్తుందనే నమ్మకంతోనే వడ్డీపై డబ్బులు తీసుకువచ్చా. ఇంతవరకు పెట్టుబడి సాయం అందలేదు. నాతో పాటు గ్రామంలో చాలామంది రైతు భరోసా రాకపోవడంతో సాగు కోసం వడ్డీ వ్యాపారులు, బ్యాంకులలో అప్పులు చేయాల్సి వస్తుంది. గత ప్రభుత్వంలో సీజన్ ప్రారంభానికి ముందే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడేవి. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహాలో అందరికీ ఒకేసారి వస్తే బాగుంటుంది.

–దొబ్బలి మొగులయ్య, రామచంద్రాపూర్, మహబూబ్‌నగర్ రూరల్

కసరత్తు కొనసాగుతోంది

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రైతు భరోసా కింద ఇప్పటివరకు ప్రతి మండలంలో ఎంపికచేసిన గ్రామాల్లోని రైతుల ఖాతాల్లో ప్రభుత్వ సాయం జమ అయింది. మిగతా గ్రామాల్లోనూ వ్యవసాయ యోగ్యమైన భూములపై కసరత్తు ఇంకా కొనసాగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలోనే రైతులందరికీ సాయం అందుతుంది.

– చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, నాగర్‌కర్నూల్

'ఆత్మీయ'తకు దూరమే..

రైతుభరోసా పథకంతో పాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద సాయానికి సైతం రైతు కూలీలు నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం భూమి లేని నిరుపేదలకు సైతం ఏటా రూ.12 వేలు ఆర్థికసాయాన్ని అందిస్తామని చెబుతోంది. ఇప్పటివరకు మండలానికో గ్రామం చొప్పున ఎంపిక చేసిన గ్రామాల్లోని లబ్ధిదారులను గుర్తించి వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 18,180 మందికి జమ చేశామని ప్రభుత్వం చెబుతుండగా, ఉమ్మడి జిల్లాలో ఈ సంఖ్య వందలకే పరిమితమైంది. ఆత్మీయ భరోసా కింద సాయం పొందేందుకు ఉపాధి హామీ పథకంలో పని చేయాలన్న నిబంధన పెట్టడంతో చాలామంది నిరుపేదలు ఈ పథకానికి దూరం అవుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నిబంధనను సడలించి, భూమిలేని రైతుకూలీలు అందరికీ ఇవ్వాలని కోరుతున్నారు.

వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆందోళనకు దిగిన రైతులు



మార్కెట్ కమిటీ కార్యాలయంలోకి ఓ రైతును పోలీసులు తీసుకెళుతుండగా అడ్డుకుంటున్న మిగతా రైతులు



మార్కెట్ కమిటీ కార్యాలయంలోకి రైతులు వెళ్లకుండా గేటు మూసివేసిన పోలీసులు



పల్లి రైతు ఆగ్రహం

మహబూబ్‌నగర్ మార్కెట్ యార్డులో వరుసగా రెండోరోజు వేరుశనగ రైతులు ఆందోళనకు దిగారు. మార్కెట్ చైర్‌పర్సన్ అనిత చెప్పినా.. బుధవారం క్వింటాల్‌కు అదనంగా రూ.200 ఇచ్చేందుకు టెండర్‌దారులు నిరాకరించడంతో ధర్నా చేపట్టారు. రైతులందరూ ముకుమ్మడిగా బస్టాండ్ వైపు దూసుకుపోయేందుకు ప్రయత్నించడంతో రంగప్రవేశం చేసిన పోలీసులు మార్కెట్ గేట్లు మూసివేసి రైతులను బయటికి రాకుండా కట్టడి చేశారు. దీంతో మార్కెట్‌యార్డు వద్ద పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

– మహబూబ్‌నగర్ (వ్యవసాయం)

క్లుప్తంగా

రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు



ఇర్ఫాన్ (ఫైల్)

ఊట్కూర్: ఆర్టీసీ బస్సు, స్కూటీ ఎదురెదురుగా ఢీకొని ఇర్ఫాన్ (19) మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయిన ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఊట్కూర్ గ్రామానికి చెందిన ఇర్ఫాన్, షాహబాజ్, షిఫాయతుల్లా అనే ముగ్గురు యువకులు బస్టాండ్ నుంచి చెక్‌పోస్టుకు స్కూటీపై వెళ్తున్నారు. ఊరలక్ష్మమ్మ ఆలయం సమీపంలో ముందుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో మక్తల్ నుంచి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. దీంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు చికిత్స కోసం క్షతగాత్రులను నారాయణపేట ఆస్పత్రికి తరలించారు. బాధితుల పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇర్ఫాన్, షహబాజ్ పరిస్థితి మరింత విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. మార్గమధ్యలోనే ఇర్ఫాన్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఇర్ఫాన్ బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మృతుడికి తండ్రి ఇస్మాయిల్, తల్లి, ఇద్దరు సోదరులు ఉన్నారు. షిఫాయతుల్లా ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో, షహబాజ్ హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న సీఐ చంద్రశేఖర్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణంరాజు తెలిపారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

అడ్డాకుల: ఇంట్లో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని నాగాయపల్లి గ్రామానికి చెందిన గద్దెగూడెం చెన్నయ్య(24) గ్రామంలో ఉంటూ తల్లితో కలిసి కూలీ పనులు చేసేవాడు. మంగళవారం రాత్రి ఇంట్లో భోజనం చేసిన తర్వాత దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున నిద్ర నుంచి లేచిన తల్లికి కుమారుడు దూలానికి వేలాడుతూ కనిపించాడు. దీతో ఆమె బోరున విలపించి చుట్టు పక్కల వారిని పిలిచి మృతదేహాన్ని కిందకు దించారు. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదు. మృతుని తండ్రి గతంలో చనిపోయాడు. తమ్ముడు హైదరాబాద్‌లో ఉంటూ పని చేస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అలంపురం.. ఆధ్యాత్మిక సంబురం



విద్యుద్దీపాల అలంకరణలో ఆలయం

నేటి నుంచి జోగుళాంబ వార్షిక బ్రహ్మోత్సవాలు

- ఐదురోజుల పాటు కొనసాగింపు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. నిజరూప దర్శన భాగ్యం
- చివరిరోజు సహస్ర కలశాలతో అభిషేకం
- భారీగా హాజరుకానున్న ప్రముఖులు, భక్తులు

అలంపూర్: అష్టాదశ శక్తిపీఠాల్లో ఐదవది అయిన అలంపూర్ జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ఫిబ్రవరి 3 వరకు ఐదురోజుల పాటు కొనసాగనున్నాయి. ఏటా అమ్మవారి ఆలయంలో జరిగే ప్రముఖ ఉత్సవాల్లో వార్షిక బ్రహోత్సవాలు ప్రత్యేకమని.. వైభవోపేతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఈఓ పురేందర్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఉత్సవాల చివరిరోజు సహస్ర ఘటాభిషేకం, అమ్మవారి నిజరూప దర్శన భాగ్యం భక్తులకు కలగనుంది. జోగుళాంబ అమ్మవారు ఆరు దశాబ్దాలుగా బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో పూజలందుకుంటున్నారు. 2005, ఫిబ్రవరి 13 వసంత పంచమి రోజున అమ్మవారి ఆలయంలో పునః ప్రాణప్రతిష్ఠ జరిగింది. నాటి నుంచి నేటి వరకు బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి.



జోగుళాంబ అమ్మవారి మూల విగ్రహం

పూజా కార్యక్రమాలు ఇలా..

- గురువారం ఉదయం 8 గంటలకు యాగశాల ప్రవేశం, పుణ్యాహవాచనం, మహా గణపతి పూజ, రుత్విక్‌వరణం, మహా కలశస్థాపన పూజలు జరగనున్నాయి. సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం నిర్వహించనున్నారు.
- శుక్రవారం నుంచి ఫిబ్రవరి 2 వరకు విశేష అర్చనలు, చండీహోమాలు, పవమానసూక్త పారాయణం, పవమాన సూక్త హోమాలు, ఆవాహిత దేవతా హోమాలు, మండపారాధన, బలిహరణం, నీరాజన మంత్రపుష్ప పూజలు ఘనంగా కొనసాగనున్నాయి.
- చివరిరోజు ఫిబ్రవరి 3 వసంత పంచమి రోజున ఉదయం 9 గంటలకు యాగశాలలో నిత్యహోమాలు, మహా పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, సహస్ర ఘటాలకు ఆవాహన అర్చన, అమ్మవారి మూల విగ్రహానికి అవభృత స్నానం, పంచామృతాలతో అభిషేకం, సహస్ర కలశాలతో అభిషేకం నిర్వహించనున్నారు. జోగుళాంబ అమ్మవారి నిజరూప దర్శనం ఉంటుంది. సాయంత్రం 4 గంటలకు బాలబ్రహ్మేశ్వరస్వామి, జోగుళాంబ అమ్మవారి శాంతి కల్యాణం నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి..



అలంపూర్ జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాం. అమ్మవారిని ప్రశాంత వాతావరణంలో భక్తులు దర్శించుకునేలా చూస్తాం.

– పురేందర్‌కుమార్, ఈఓ, అలంపూర్

కురుమూర్తిలో గోవింద నామస్మరణ



గిరి ప్రదక్షిణకు హాజరైన భక్తులు

- తరలివచ్చిన భక్తులు

చిన్నచింతకుంట: తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవం అమ్మాపురం కురుమూర్తి స్వామి దర్శనానికి అమవాస్యను సందర్భంగా బుధవారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి సుప్రభాత సేవ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం నుంచే ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలొచ్చి క్యూలో ఉన్నారు. మెట్లపై దీపాలు వెలిగిస్తూ గోవింద నామస్మరణ చేశారు. మెట్టు మెట్టుకు కొబ్బరి కాయలు కొట్టి స్వామిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మట్టికుండలో పచ్చిపులుసు అన్నం నైవేద్యంగా స్వామికి సమర్పించారు. అనంతరం అలివేలు మంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయ స్వామి, ఉద్దాల మండపం వద్ద భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

ఘనంగా గిరి ప్రదక్షిణ

కురుమూర్తి స్వామి ఆలయం వద్ద గిరి ప్రదక్షిణ ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, విశ్వహింద్ పరిషత్, బీజేపీ నాయకులు స్వామి వారి రాజగోపురం వద్ద పూజలు నిర్వహించారు. రాజగోపురం ప్రధాన మెట్లనుంచి స్వామి వారి ప్రధాన ఆలయం పక్కన, కలశపూజ మండపం పక్క నుంచి మట్టి అమ్మాపురం గ్రామం మీదుగా ఐదు కిలోమీటర్లు స్వామి వారి ఆలయం వరకు ప్రదక్షణలు చేశారు.



కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

నేటి నుంచి లక్ష్మీచెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలు



ఆలయ రాజగోపురం

- ఫిబ్రవరి 6 వరకు కొనసాగనున్న గంగాపురం జాతర
- భారీ ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ, అధికారులు

జడ్చర్ల టౌన్: కృతయుగంలో మత్స్యపురంగా.. త్రేతాయుగంలో దురితకోలాహలంగా.. ద్వాపర యుగంలో మాయాపురంగా పిలువబడి కలియుగంలో గంగాపురంగా పిలుచుకుంటున్న లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏటా మాఘశుద్ధ పాడ్యమి మొదలు నవమి వరకు ఉత్సవాలు కొనసాగుతాయి. ఫిబ్రవరి 6వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాలకు ఆలయం పడమర ప్రాంతం నుంచి, తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి సైతం భక్తులు రానున్నారు.

10వ శతాబ్దంలో ఆలయం నిర్మాణం

జడ్చర్ల మండలం గంగాపురంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం నాటి శిల్పుల కళానైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఆలయం 10వ శతాబ్దంలో నిర్మించినట్లుగా ఆనవాళ్లున్నాయి. కోణార్క్ సూర్యదేవాలయం, గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం ఒకే విధంగా నిర్మించారని ప్రతీతి. ఆలయం చతురస్రాకారంలో నిర్మితమై ఉండటం ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. ఆలయప్రాంగణంలో నిర్మించిన కోనేరు పలు ప్రత్యేకతలను నిలుపుకుంది.

ఏర్పాట్లు పూర్తి

మహబూబ్‌నగర్ ఆర్డీఓ నవీన్ పర్యవేక్షణలో జాతర కోసం ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు సమన్వయంతో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో పెయింటింగ్, శుద్ధి చేసే ప్రక్రియ, ప్రాకారాలు, కోనేరు ఇతరు నిర్మాణాలకు 40మందితో జాజు పూయించారు. ఆలయ ప్రాంగణం, వెనకాల భక్తులు వంటా వార్పు చేసుకునేందుకు గానూ చదునుచేసి సిద్ధంగా ఉంచారు. కోనేటిలో భక్తులు స్నానాలు ఆచరించేందుకు గానూ నీటిని నింపుతున్నారు.



చెన్నకేశవస్వామి మూలవిరాట్

బ్రహ్మోత్సవ వివరాలు..

గురువారం అలంకారాభిషేకంతో ప్రారంభం కానున్న ఉత్సవాలు. తొలిరోజున స్వామి, అమ్మవారికి అష్టోత్తర శతకలశాభిషేకం, నూతన వస్త్రాల అలంకరణతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. 31 శుక్రవారం విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణం, మృత్సంగ్రహణం, అంకురార్పణం, అగ్నిప్రతిష్ఠ, పల్లకీసేవ నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 1న ధ్వజారోహణం, ప్రాణప్రతిష్ఠ, బలిహరణం, 2న ఆదివారం రాత్రికి ఎదుర్కోలు, స్వామి, అమ్మవార్ల కల్యాణం, సోమవారం మనోహరమైన శేష, హంస వాహన సేవలు, పుష్పరథం (చిన్నతేరు), మంగళవారం రథసప్తమి సందర్భంగా పెద్ద తేరు (రథోత్సవం), బుధవారం శకటోత్సవం (బండ్లు తిప్పుట), గురువారం పూర్ణాహుతి, చక్రతీర్థంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

సర్వం సిద్ధం

ప్రతి ఏటా మాఘమాసంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం. గురువారం నుంచి ఫిబ్రవరి 6 వరకు భక్తుల రాకపోకల కోసం ప్రత్యేక బస్సులు నడిపించాలని ఆర్టీసీ అధికారులను కోరాం. అలాగే రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్యశాఖల సహకారం తీసుకుంటున్నాం. ఆలయంలోనూ విద్యుత్ స్తంభాల ఆధునీకరణ, కాటేజ్ నిర్మాణం, సీసీ రోడ్డు లాంటివి నూతనంగా చేపట్టాం.

– దీప్తిరెడ్డి, కార్యనిర్వహణాధికారి, గంగాపూర్ ఆలయం

టీడీసీఏ టోర్నీ ఫైనల్‌కు ఉమ్మడి జిల్లా జట్టు

- సెమీఫైనల్‌లో ఆదిలాబాద్‌పై ఘన విజయం
- రాణించిన దీపక్‌పాటిల్, రవితేజ



దీపక్ పాటిల్ (54పరుగులు నాటౌట్)

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని దోమలగూడలో జరుగుతున్న తెలంగాణ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ అంతర్‌జిల్లా టీ–20 క్రికెట్ టోర్నమెంట్‌లో ఉమ్మడి జిల్లా జట్టు అద్భుత ఆటతీరు ప్రదర్శిస్తోంది. బుధవారం ఆదిలాబాద్ జట్టుతో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించి ఫైనల్‌లో అడుగుపెట్టింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఆదిలాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 116 పరుగులకు ఆలౌటైంది. ప్రియాన్ 23, షేక్ అర్ఫాన్ 20 పరుగులు చేశారు. మహబూబ్‌నగర్ బౌలర్లు రవితేజ 4 ఓవర్లలో 10 పరుగులు ఇచ్చి 3 వికెట్లు, సాహిల్ 4 ఓవర్లలో 20 పరుగులు ఇచ్చి 3 వికెట్లు, గౌతం, రాంచరణ్ చెరో వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఉమ్మడి జిల్లా జట్టు 16.1 ఓవర్లలో కేవలం 2 వికెట్లు కోల్పోయి 121 లక్ష్యాన్ని చేధించింది. దీపక్ పాటిల్ 47 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 54 పరుగులకు నాటౌట్, రవితేజ 32 బంతుల్లో 6 ఫోర్లతో 38 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

జట్టుకు అభినందనలు

టీడీసీఏ అంతర్‌జిల్లా టోర్నీలో ఫైనల్‌కు చేరడంపై ఉమ్మడి జిల్లా జట్టును ఉమ్మడి జిల్లా కన్వీనర్ నవీన్‌కుమార్, జట్టు కోచ్ నవాజ్‌షా, మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. అంతర్‌జిల్లా టోర్నమెంట్‌లో పాలమూరు చక్కటి ఆటతీరును ప్రదర్శిస్తున్నారని, ఇదేస్ఫూర్తితో ఫైనల్‌లో సత్తా చాటి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవాలని వారు ఆకాంక్షించారు. అంతకుముందు సెమీఫైనల్ మ్యాచ్‌ను టీడీసీఏ అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంభించి క్రీడాజట్లను అభినందించారు.

వలస కూలీపై దాడి

- అస్వస్థతకు గురై మహిళ మృతి



శాంతమ్మ (ఫైల్)

మదనాపురం: బతుకుదెరువు కోసం వలసవెళ్లిన కూలీపై ఓ వ్యక్తి దాడికి పాల్పడటంతో మృతిచెందింది. ఈ ఘటన మదనాపురం మండలం దుప్పల్లిలో కలకలం రేపింది. మృతురాలి కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. దుప్పల్లికి చెందిన రమేష్ నాయక్ భార్య కేత్లావత్ శాంతమ్మ (30) మూడు నెలల క్రితం కొకుంట్ల మండలం అప్పంపల్లికి చెందిన రాఘవారెడ్డి అనే మేస్త్రి గుంపులో కరీంనగర్ జిల్లాకు వలస వెళ్లింది. అక్కడ పని విషయంలో లక్ష్మణ్ అనే వ్యక్తితో గొడవ జరిగింది. ఈ క్రమంలో శాంతమ్మపై దాడికి పాల్పడటంతో అస్వస్థతకు గురైంది. అక్కడి నుంచి ఆమె మంగళవారం రాత్రి ఇంటికి చేరుకొని జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసింది. ఈ విషయంపై మరుసటి రోజు పోలీసులకు ఫిర్యాదు చేయాలని అనుకున్నారు. రాత్రి కుటుంబ సభ్యులతో కలసి నిద్రించిన శాంతమ్మ.. తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందింది. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు మృతురాలి భర్త రమేష్ నాయక్ ఫిర్యాదు చేసినట్లు ఆత్మకూర్ సీఐ శివకుమార్ తెలిపారు.

ఎమ్మెల్యే సంతకం ఫోర్జరీ

- ఎమ్మెల్యే ఫోర్జరీ సంతకంతో సిఫారుసు లేఖ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి
- ఐదుగురిని అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు



వివరాలను వెల్లడిస్తున్న సీఐ శివశంకర్

నారాయణపేట: నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి పేరిట నకిలీ లెటర్‌ప్యాడ్ తయారు చేసి ఓ వాచ్‌మేన్ ఉద్యోగం కోసం ఎమ్మెల్యే సంతకాన్ని ఫోర్జరీ చేసి ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శివశంకర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే..నర్వ మండలం పెద్దకడమూరుకు చెందిన సాకలి శైలేష్ బీసీ గురుకుల పాఠశాలలో 2017 నుంచి 24 మార్చి వరకు అతిథి హిందీ అధ్యాపకుడిగా పని చేశారు. ఆ సమయంలో అతడికి గురుకులాలకు సంబంధించిన అధికారులతో కొంత సాన్నిహిత్యం ఉండడంతో.. దాన్ని ఆసరాగా చేసుకొని గురుకులాల్లో సీట్లు ఇప్పిస్తానని, ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికేవారు. ఈ క్రమంలో ప్రస్తుతం మరికల్ ఉన్న కోటకొండ బీసీ గురుకుల పాఠశాల వాచ్‌మేన్ పోస్టు కోసం పైరవీ చేస్తానని అక్కడే స్వీపర్‌గా పని చేస్తున్న జ్యోతికి చెప్పాడు. అయితే ఈ విషయం జ్యోతి తనకు సమీప బంధువు అయిన సత్యమ్మకు చెప్పగా.. ఇద్దరూ కలిసి శైలేష్‌ను కలిశారు. లక్ష రూపాయలు ఇస్తే ఆ ఉద్యోగం ఇప్పిస్తానని శైలేష్ నమ్మ పలికారు. ఇందుకు నారాయణపేట ఎమ్మెల్యే సిఫార్సు లేఖ కావాలని, ఆ నకిలీ లెటర్‌ను తానే తయారు చేసి, ఎమ్మెల్యే సంతకం ఫోర్జరీ చేస్తానని వారికి తెలిపాడు. దీంతో సత్తెమ్మ తనకు తెలిసిన వారి నుంచి రూ.లక్ష తీసుకొని జ్యోతికి ఇవ్వగా.. ఆమె రూ.15వేలు తన వద్దే పెట్టుకొని మిగతా రూ.85 వేలు శైలేష్‌కు ఇచ్చింది. తర్వాత నారాయణపేటలో అరుణ్ అనే వ్యక్తికి రూ.5 వేలు ఇచ్చి జిరాక్స్ సెంటర్‌లో నారాయణపేట ఎమ్మెల్యే లెటర్‌ను తయారు చేసి, దానిని జిరాక్స్ తీసుకున్నాడు. ఎమ్మెల్యే పర్ణికారెడ్డి సంతకాన్ని ఫోర్జరీ చేసి హైదరాబాద్‌లోని బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో అందజేశారు. అక్కడ నుంచి మరికల్ ప్రిన్సిపాల్ అందేటట్లుగా చేశారు. ఈ విషయం సదరు ప్రిన్సిపాల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ను సంప్రదించగా.. అది నకిలీదని గుర్తించిన ఎమ్మెల్యే పర్ణికారెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు శైలేష్, జ్యోతి, సత్తెమ్మ, రాందాస్, అరుణ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.

జిన్నారంలో శివారులో చిరుత

- రెండు మేకలపై దాడి

మరికల్: ఎలాంటి గుట్టల ప్రాంతం కాని జిన్నారం శివారులో చిరుత సంచరించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. బుధవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో చిత్తనూర్ ఇథనాల్ కంపెనీలో పనిచేసే కార్మికులు వాహనంలో వెళ్తుండగా, మరికల్ మండలం జిన్నారం శివారులోని చెట్ల పొదలో నుంచి రోడ్డుపైకి వస్తున్న చిరుతను చూసి భయపడ్డారు. దాని భారీ నుంచి తప్పించుకునేందుకు వాహనాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్లారు. తర్వాత తిరిగి చూసేలోగా చిరుత కనిపించకుండా పోయింది. రోడ్డు పక్కనే వ్యవసాయ పొలం దగ్గర నిద్రిస్తున్న రైతును నిద్రలేపి దాని జాడ కోసం వెతికినా కన్పించలేదు. ఈ విషయంపై గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వెళ్లిన అటవీ అధికారులు పాద ముద్రల జాడ కోసం వెతికారు. కనిపించకపోవడంతో అధికారులు వెనుదిరిగారు. చిరుత రెండు మేకలపై దాడి చేసి చంపేసిన విషయాన్ని కాపారులు అటవీశాఖ అధికారులకు ఆలస్యంగా అందించారు. దీంతో మరోసారి వారు ఘటనా స్థలానికి వెళ్లి చిరుత పాదముద్రలను గుర్తించి, చనిపోయిన మేకలను పరిశీలించారు. చిరుత ఈ ప్రాంతంలో ఉందని, రైతులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు గ్రామస్తులకు సూచించారు. రైతులు వ్యవసాయ పొలాల దగ్గర పశువులను కట్టేయవద్దని, రాత్రి వేళలో పొలాలకు వెళ్లే వారు జోడిగా వెళ్లాలని సూచించారు.

ఆటోను తగలపెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

మహబూబ్‌నగర్ క్రైం: ఇంటి ఎదుట నిలిపి ఉన్న ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు తగలపెట్టారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని కుమ్మరివాడిలో నివాసం ఉంటున్న వెంకటేష్ తనకు సంబంధించిన ఆటోను రోజు మాదిరిగానే ఇంటి ఎదుట నిలిపాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు ఆటోపై పెట్రోల్ పోసి తగలపెట్టారు. దీంతో పాటు పక్కనే ఉన్న బోర్ మోటార్‌కు సైతం నిప్పు పెట్టారు. ఆటో పూర్తిగా దగ్ధం కావడంతో పాటు పక్కనే ఓ ఇంటికి సైతం మంటలు అంటుకోవడంతో పాక్షికంగా దగ్ధమైంది. అప్పటికే గుర్తించిన కుటుంబ సభ్యులు నీటితో మంటలను అదుపు చేశారు. దాదాపు రూ.1.50లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.